
# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం | 15 జూన్ 2025 | పేజీలు 8


## ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి తెలంగాణ మంత్రి లేఖ

- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం
- కేంద్ర జలశక్తి శాఖకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ
- ప్రాజెక్టు జీడబ్ల్యూడీటీ, పునర్విభజన చట్టానికి విరుద్ధమని స్పష్టీకరణ
- ఏపీ పీఎఫ్ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పణను ఆపాలని వినతి
- టెండర్లు పిలవకుండా ఏపీని నిలువరించాలని కేంద్రానికి డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అంశం మరోమారు వివాదాస్పదమైంది. ఈ ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శనివారం కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుందని, దీనిని తక్షణమే అడ్డుకోవాలని ఆయన ఆ లేఖలో కోరారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి శాఖకు రాసిన లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ఈ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు, గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) అవార్డుతో పాటు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక సాధ్యసాధ్యతల నివేదిక (పీఎఫ్ఆర్)కు కేంద్రం ఇంకా ఆమోదం తెలపకముందే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డీపీఆర్ ఎలా అడుగుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే

-2 లో

## హాలీవుడ్, బాలీవుడ్.. హైదరాబాద్‌కు రావాలి

- చిత్ర పరిశ్రమ గొప్పగా రాణించాలి
- తెలంగాణ అభివృద్ధికి దోహదపడాలి
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం
- కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తాం
- గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



-2 లో

**హైదరాబాద్ పెన్ పవర్:** హాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమలను కూడా హైదరాబాద్ గడ్డ మీదకు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తెలుగు సినీపరిశ్రమకు అన్ని విషయాల్లోనూ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొన్ని అంశాల్లో కఠిన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ.. సినీ పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటును అందించడంతో పాటు సముచిత స్థానం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా శనివారం జరిగిన గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్-2024 కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా.. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డును నందమూరి బాలకృష్ణ, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమ దర్శకుడిగా నాగ్‌అశ్విన్‌లు పురస్కారాలు స్వీకరించారు.

## బీసీ ఉపాధ్యాయులకు క్రీమీలేయర్ ఎత్తివేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో బీసీ ఉపాధ్యాయులకు క్రీమీలేయర్ వర్తింప చేయడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని, తక్షణమే దానిని ఎత్తివేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ మేరకు శనివారం అబిడ్స్‌లోని స్టాన్లీ కళాశాలలో తెలంగాణ బీసీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో

-2 లో

## కాంగ్రెస్ బాటలో బీజేపీ.!! ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు

- ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు
- మండే టు ఫ్రైడే స్టేట్ ఆఫీస్ లో అవైలబుల్
- ఏ రోజు ఎవరు ఆఫీసులో ఉంటారో లిస్ట్ రిలీజ్
- గాంధీభవన్ ను ఫాలో అవుతున్న బీజేపీ
- రెండు జాతీయపార్టీలలో నయా ట్రెండ్

-2 లో



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, ప్రజలకు చేరువై వారి సమస్యలు పరిష్కరించే ఉద్దేశంతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గాంధీభవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజాప్రతినిధులు పార్టీ ఆఫీసులో అందుబాటులో ఉండేందుకు కాంగ్రెస్

## కాళేశ్వరం ప్రాజెక్టుపై సీపీఐ నేత సంచలన వ్యాఖ్యలు

- విఫల ప్రాజెక్టు అన్న కూనంనేని సాంబశివరావు
- ప్రజాధనం వృధా చేశారంటూ కేసీఆర్‌పై ఫైర్
- పనికిరాని కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు ఆపాలని ప్రభుత్వానికి డిమాండ్

-2 లో



# హాలీవుడ్, బాలీవుడ్.. హైదరాబాద్‌కు రావాలి

కాంతారావు ఫిల్మ్ అవార్డును విజయ్ దేవరకొండ, రఘుపతి వెంకయ్య పురస్కారాన్ని యండమూరి వీరేంద్రనాథ్, పైడి జైరాజ్ అవార్డును మణిరత్నం, బీఎన్‌రెడ్డి పురస్కారాన్ని సుకుమార్, నాగిరెడ్డి–చక్రపాణి ఫిల్మ్ అవార్డును అట్లూరి పూర్ణచంద్రరావు అందుకున్నారు. ఈ వేడుకలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గతంలో భారతీయ సినీ పరిశ్రమ అంటే బాలీవుడ్ అని చర్చించుకునేవారని.. ఇప్పుడు భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమగా చెప్పుకోవడం అందరికీ గర్వకారణమన్నారు. తమ ప్రభుత్వం చిత్ర పరిశ్రమను గౌరవించి అన్ని వసతులు కల్పిస్తోందని వివరించారు.

**ఆ స్థానంలో గద్దర్ అవార్డు**

'నటులు, దర్శకులు, సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు 1964లో నంది అవార్డులను తీసుకువచ్చారు. తొలిసారి ఉత్తమ నటుడిగా అక్కినేని నాగేశ్వరరావు నంది అవార్డు అందుకున్నారు. అప్పటి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో 14 ఏళ్ల క్రితం వరకు నంది అవార్డులు ఇస్తూ వచ్చారు. తర్వాత వివిధ కారణాలతో అవి ఆగిపోయాయి. అవార్డుల కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని సినీ పరిశ్రమ ప్రముఖులు, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ప్రతిపాదించారు. మా ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల పేరుతో ప్రదానం చేయాలని నిర్ణయించింది.

**మీకేం కావాలో చెబితే.. ప్రభుత్వ సహకారం**

నటులు, కళాకారులు, దర్శకులు.. ఇలా అందరినీ గౌరవించాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. సినీ పరిశ్రమలో తొలి తరం.. అన్న ఎన్టీఆర్, ఏఎన్నార్, రెండోతరంలో.. కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు.. మూడోతరంలో చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున వంటి కథనాయకులు వచ్చారు. నేడు నాలుగోతరంలో పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు, అల్లు అర్జున్ వంటి వారున్నారు. వీరంతా పరిశ్రమలో రాణిస్తున్నారు. బన్నీ, వెంకట్, అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్‌అశ్విన్ ఇలా చాలామంది నాకు కాలేజీ రోజుల నుంచి తెలుసు. మా యువమిత్రులు పరిశ్రమలో రాణించడం.. వారిని నేను అభినందించడం సంతోషకర సందర్భం.

తెలంగాణ రైజింగ్– 2047 నినాదంతో ముందుకు వెళుతున్నాం. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తయ్యే ఆ సమయానికి ప్రపంచాన్ని శాసించే ఆర్థిక వ్యవస్థగా దేశం అభివృద్ధి చెందాలి. ఐటీ, ఫార్మా, రక్షణ, సినీ పరిశ్రమలు గొప్పగా రాణించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ స్థాయికి అభివృద్ధి చేస్తామని ఇటీవల నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీకి చెప్పా. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సినీ పరిశ్రమ గొప్పగా అభివృద్ధి చెందాలి. హాలీవుడ్ అంటే అమెరికాకు, బాలీవుడ్ అంటే ముంబయికి వెళ్తున్నారు. దర్శకుడు రాజమౌళిని అడుగుతున్నా.. ప్రపంచం గుర్తించేలా మీరు అద్భుతమైన సినిమాలు తీస్తున్నారు.. హాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమను ఈ గడ్డకు ఎందుకు తీసుకురావడం లేదు? ఆ పరిశ్రమల వారు కూడా హైదరాబాద్ గడ్డపై షూటింగ్‌లకు రావాలి. అందుకోసం మీకేం కావాలో చెబితే ప్రభుత్వం అండగా ఉంటుంది.

**తెలంగాణ విజన్ 2047లో చిత్ర పరిశ్రమకు చాప్టర్**

తెలంగాణ ప్రభుత్వ 2047 విజన్ డాక్యుమెంట్‌లో చలనచిత్ర పరిశ్రమకు ఒక చాప్టర్ ఇస్తాను. నేను మరో 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో ఉంటా. ఏ హోదాలో ఉన్నా.. మీకు అండగా నిలుస్తా. చిత్ర పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు, సహకారం అందిస్తాం. ప్రపంచంలోని ఫార్చ్యూన్–500 కంపెనీల్లో 85 తెలంగాణ గడ్డపైనే ఉన్నాయి. దేశంలో ఏ నగరంలోనూ ఇన్ని కంపెనీలు లేవు. బెంగళూరు, అమరావతి, ముంబయి, చెన్నై.. ఈ నగరాలేవీ హైదరాబాద్‌కు పోటీ కాదు.. మా పోటీ న్యూయార్క్, టోక్యో వంటి నగరాలతోనే. పరిశ్రమల్లో చైనాతో పోటీ పడాలన్నది మా ఆలోచన.

**గద్దరన్న అంటే చైతన్యం**

గద్దరన్న ఒక విప్లవం, చైతన్యం, వేగుచుక్క. ఆయన స్ఫూర్తితో తెలంగాణ సాధించుకున్నాం. ఆయన స్ఫూర్తితోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్నాం. తెలంగాణ పురోగతిలో చిత్ర పరిశ్రమ భాగం కావాలి. గతంలో ఏమైనా అంశాలున్నా వాటిని పక్కన పెట్టండి. అందరం కలిసి అభివృద్ధి వైపు నడవాలి. గద్దరన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేస్తున్నా.. పాతబస్తీ వాసి రాహుల్ సిప్లిగంజ్ సంగీత రంగంలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఆయనకు ఏదైనా అవార్డు ఇవ్వాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**అట్టహాసంగా అవార్డుల ప్రదానోత్సవం**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ చలన చిత్ర పురస్కారాల కార్యక్రమం అట్టహాసంగా సాగింది. చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలు హాజరు కావడంతో సందడిగా మారింది. 2014 నుంచి 2023 వరకు ఉత్తమ చిత్రాలకు.. 2024లో అన్ని విభాగాలకు గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రదానం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో దాదాపు గంటన్నర పాటు ఉండి పురస్కారాలు ప్రదానం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 వరకు ఈ వేడుక జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎండీ హరీశ్, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. సినీ పరిశ్రమ నుంచి నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, ఆర్.నారాయణమూర్తి, సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు రాజమౌళి, గేయ రచయిత చంద్రబోస్, నటీమణులు జయసుధ, జయప్రద, సుహాసిని తదితరులు హాజరయ్యారు.

### ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు... కేంద్రానికి
## తెలంగాణ మంత్రి లేఖ

- మొదటి పేజీ తరువాయి

ఈ పీఎఫ్‌ఆర్‌ను తిరస్కరించాలని, డీపీఆర్ సమర్పించకుండా ఆంధ్రప్రదేశ్‌ను నిలువరించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి టెండర్లు పిలవకుండా ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కూడా మంత్రి ఉత్తమ్ తన లేఖలో కేంద్రాన్ని కోరారు.

## బీసీ ఉపాధ్యాయులకు క్రీమీలేయర్ ఎత్తివేయాలి

- మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయులకు మహాత్మా పులే ప్రతిభా పురస్కారాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 180 మంది విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ..

ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో లేవనెత్తి పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. ఎస్ఎస్‌సీ పరీక్షల డైరెక్టర్ జనరల్ కృష్ణారావు,

బీసీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, జాక్టో ఛైర్మన్ సదానందంగౌడ్, ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బాటలో బీజేపీ.!!
## ప్రజలకు అందుబాటులో ప్రజాప్రతినిధులు

- మొదటి పేజీ తరువాయి

ఎంచుకున్న విధానాన్ని బీజేపీ కూడా ఫాలో అవుతోంది. మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు గాంధీభవన్ లో అందుబాటులోఉంటూ పార్టీ కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరిస్తూ పరిష్కార మార్గాలు చూపుతున్నారు. ఏ రోజు ఎవరు అందుబాటులో ఉంటారనేది ముందస్తుగానే సమాచారం ఇస్తూ వస్తున్నారు. మంత్రులు అందుబాటులో లేని రోజుల్లో కార్పొరేషన్ల చైర్మన్లు కూడా అర్జీలు స్వీకరిస్తున్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్‌కార్డులు, వైద్య సాయం, భూములు, రెవెన్యూ సంబంధిత సమస్యలపై వినతులు వస్తున్నాయి. విజ్ఞాపనలు అందించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న ప్రజలు గాంధీభవన్ వద్ద క్యూ కడుతున్నారు. ప్రజల్లో ఉండేందుకు ఈ ఫార్ములా కరెక్ట్ అని భావిస్తున్న కమల నాథులు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఏ రోజు ఏ ప్రజాప్రతినిధి అందుబాటులో ఉంటారనే అంశాలను వెల్లడిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం మొదటి అంతస్తులోని రూం నంబర్ 102లో ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారని తెలిపింది. ఈ నెల 16(సోమవారం) నుంచి అందుబాటులో ఉంటారని తెలిపింది. 16న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, 17న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, 18న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, 19న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, 20న రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య అందుబాటులో ఉంటారని తెలిపింది.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై సీపీఐ నేత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఈ ప్రాజెక్టు కోసం ఇకపై ప్రజాధనాన్ని వెచ్చించవద్దని ఆయన ప్రభుత్వానికి సూచించారు. హైదరాబాద్‌లో ఈ రోజు ఉదయం కూనంనేని మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి అన్నీ తానై వ్యవహరించిన కేసీఆర్, ఇప్పుడు మాత్రం ప్రాజెక్టుతో తనకు ఎలాంటి సంబంధం లేనట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో అదనంగా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందలేదని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం పంటలకు అందుతున్న నీరంతా ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారానే వస్తోందని స్పష్టం చేశారు. కాళేశ్వరం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ఇది పూర్తిగా నిరుపయోగమైన ప్రాజెక్టు అని కూనంనేని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపైనా కూనంనేని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేంద్రం మానవ హక్కులను ఉల్లంఘిస్తోందని ఆరోపించారు.

మావోయిస్టుల

మృతదేహాలను చూసి కూడా కేంద్రంలోని పెద్దలు భయపడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు నేత కేశవరావు మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం అత్యంత దారుణమని కూనంనేని అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు.

## ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు మీకు అభినందనలు శుభాకాంక్షలు



**హైదరాబాద్ పెన్ పవర్:**మీరు ఇందిరమ్మ ఇల్లు నించుకోవడానికి ప్రభుత్వం విడతల వారిగా 5 లక్షల రూపాయలు సహాయం చేస్తుంది.ఇళ్ల నిర్మాణం కోసం 8 ట్రాక్టర్ల ఇసుక ఉచితంగా ఇస్తుందిఇల్లు నిర్మాణాన్ని 400- 600 పిట్లు లోపే ఇల్లు నిర్మించాలిఇళ్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే మహిళా సంఘాల నుండి మీకు లక్ష రూపాయల రుణం అందిస్తుంది.10 సంవత్సరాల తర్వాత ప్రజా పాలన ప్రభుత్వం లో ఇందిరమ్మ ఇల్లు వస్తున్నాయిమీకు శుభాకాంక్షలు. ఎటువంటి ఆటంకాలు లేకుండా మీరు ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకోవాలి.

## ఉచిత మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

**హైదరాబాద్ పెన్ పవర్:**పేద ప్రజలకు వ్యాధులు సంభవించినప్పుడు ఎక్కడ వెళ్ళలేని పరిస్థితి ఉన్న వారికి మెడికల్ క్యాంపు ఎంతో దోహదపడుతుంది ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు.జనహిత సేవా ట్రస్ట్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్, కిమ్స్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ విచ్చేసి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని ఇక్కడ అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలను పరీక్షించుకొని డాక్టర్లను సంప్రదించి మంచి వైద్యం తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో జరిగే ఇలాంటి హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బీసీలలో ఐక్యత లోపించింది పార్టీలకు అతీతంగా ఏకం కావాలి టీపీసీసీ చీఫ్

**హైదరాబాద్ పెన్ పవర్:**బీసీలలో ఐక్యత లోపించిందని బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలకు అతీతంగా బీసీలు ఏకం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నాంపల్లిలో జరిగిన ఓబీసీ పోరుబాట పుస్తకావిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. కేంద్రం తీసుకున్న కుల గణన నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంగా అభివర్ణించారు. కుల గణనతో తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ దేశంలోని వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోగలిగారన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనల్లో నుంచి పుట్టిందే కుల సర్వే అన్నారు. చాలా వరకు బీసీలను ఓటు సాధనాలుగానే చూశారని.. మా వాటా మాకు కావాలి అనే స్థాయికి బీసీలు ఎదిగారు. సమాజంలో ఎవరి వాట వారికే సిద్ధాంతానికి కట్టుబడి పారదర్శకంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుల సర్వే నిర్వహించిందన్నారు .కుల సర్వేను వ్యతిరేకించిన కేంద్రంలోని బీజేపీ సైతం జనగణనతో పా టు కుల గణన చేపడతామని ప్రకటించింది. ఖర్గే,రాహుల్ గాంధీ సమక్షంలో కుల సర్వే పై దేశ వ్యాప్తంగా చేపడుతామన్నారు.

# దర్యాప్తు సీరియస్?గా సాగుతోంది.. బ్లాక్ బాక్స్ డీకోడ్ అయితే కారణాలు తెలుస్తాయి: మంత్రి రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్ విమాన ప్రమాదం దర్యాప్తు సిరియస్ గా జరుగుతోంది..పలు కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునే ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే విమానం శకలాలనుంచి డీవీఆర్, బ్లాక్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం(జూన్14) బ్లాక్ బాక్స్ డీకోడ్ చేసే ప్రయత్నాలు మొదలు పెట్టారు. బ్లాక్ బాక్స్ డీకోడ్ అయితే ప్రమాదానికి గల కారణాలు వెలుగులోకి వస్తాయి.. ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తుపై పౌర విమాన యానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వివరాలు తెలిపారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు వేగవంతం చేస్తున్నామన్నారు పౌర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు. కూలిపోయిన విమానం బ్లాక్ బాక్స్ ను దర్యాప్తు అధికారులు డీకోడ్ చేస్తున్నారు వివరాలకోసం వేచి ఉన్నామన్నారు. శనివారం నాడు అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు రామ్మోహన్ నాయుడు. తన తండ్రి (ఎర్రన్నాయుడు) కూడా గతంలో ప్రమాదంలో మరణించారు.. ఆ బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసని..మృతుల కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలనని ఆవేదన వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదం తెలిసిన వెంటనే బోయింగ్ 787 సిరీస్ విమానాలను పరిశీలించాల్సిందిగా డీజీసీఏకు ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. దేశంలో మొత్తం 34 బోయింగ్ విమానాలు ఉండగా, ఇప్పటికే 8 విమానాలను చెక్ చేసినట్లు చెప్పారు.

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై హై లెవెల్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు రామ్మోహన్ నాయుడు. మృతదేహాల గుర్తింపు కోసం డీఎన్ఏ టెస్టులునిర్వహిస్తున్నారు. గుజరాత్‌లోనే వీలైనంత త్వరగా అవి పూర్తవుతాయని చెప్పారు.అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిని వదిలిపెట్టమని మరోసారి హామీ ఇచ్చారు రామ్మోహన్ నాయుడు. ఈ ప్రమాదంపై తన రాజీనామాను ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం దారుణం అన్నారు. మొత్తం మీద రామ్మోహన్ నాయుడు ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూనే, సహాయక చర్యలు, దర్యాప్తు పురోగతి, భవిష్యత్తులో భద్రతా చర్యల పెంపుదలపై దృష్టి సారించారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం..సరిగ్గా ఆరోజు ఏం జరిగిందంటే..తొలిసారి కేంద్రం ప్రెస్ మీట్




**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత తొలిసారి మీడియా సమావేశం నిర్వహించింది కేంద్రం. శనివారం (జూన్14) శాఖ కార్యదర్శితో కలిసి ప్రమాదానికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు. అహ్మదాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో జరిగిన విమాన ప్రమాదం యావత్ దేశాన్ని కుదిపేసిందన్నారు. ప్రమాద సంఘటన వివరాలను మీడియాకు వివరించారు. జూన్ 12న అహ్మదాబాద్‌లో కూలిపోయి కనీసం 260 మంది మృతి చెందారు. టేకాఫ్ తీసుకున్న తర్వాత విమానం 650 అడుగుల ఎత్తుకు వెళ్లింది ఆ తర్వాత క్రమంగా డౌన్ కావడం జరిగిందన్నారు. టేకాఫ్ అయిన సరిగ్గా ఒక నిమిషం తర్వాత మేఘనినగర్‌లోని మెడికల్ హాస్టల్ కాంప్లెక్స్‌పై విమానం కూలిపోయిందని అన్నారు. 650 అడుగుల ఎత్తుకు చేరుకున్న తర్వాత విమానం ఎత్తు కోల్పోవడం ప్రారంభమైంది. పైలట్ మధ్యాహ్నం 1:39 (జూన్ 12) గంటలకు ATCకి మేడే కాల్ ఇచ్చాడని తెలిపారు. ATC ప్రకారం విమానాన్ని సంప్రదించడానికి ప్రయత్నించినప్పుడు ఎటువంటి స్పందన రాలేదు. సరిగ్గా ఒక నిమిషం తర్వాత విమానాశ్రయం నుంచి2 కి.మీ దూరంలో ఉన్న మేఘని నగర్‌లో విమానం కూలిపోయింది" అని పౌరవిమానయాన శాఖ కార్యదర్శి సిన్హా అన్నారు. గురువారం ప్రమాదానికి ముందు ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్ లైనర్ విమానం పారిస్-ఢిల్లీ-అహ్మదాబాద్ సెక్టార్ ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేసిందని సిన్హా చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా

భద్రతా ప్రమాణాలను పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు మంత్రి రామ్మోహన్ నాయుడు. ప్రమాదం తెలిసిన వెంటనే బోయింగ్ 787 సిరీస్ విమానాలను పరిశీలనకు డీజీసీఏకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. దేశంలో మొత్తం 34 బోయింగ్ విమానాలు ఉండగా, ఇప్పటికే 8 విమానాలను చెక్ చేసినట్లు చెప్పారు.

# నాన్న గొప్పతనం వెలకట్టలేనిది.. కోపంలో బాధ్యత.. మాటల్లో ప్రేమ

**హైదరాబాద్ పెన్ పవర్:**నాన్న తన పిల్లల ఎదుగుదల కోసం కష్టపడే వ్యక్తి. ఆయన త్యాగం, సహనం వెలకట్టలేనివి. సమాజంలో ఇంతటి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న నాన్నను గౌరవించడానికి ప్రతి ఏడాది జూన్ మూడో ఆదివారం( 2025, జూన్? 15) ఫాదర్స్ డే సందర్భంగా నాన్నల గొప్పతనంపై స్పెషల్? స్టోరీ...

నాన్న శ్రమజీవి.. కుటుంబం కోసం అలుపెరుగని ప్రయాణం చేస్తాడు. బాధ్యతల బరువులు మోస్తూ ఎన్నో త్యాగాలు చేస్తాడు. తన ఇష్టాలు కూడా మర్చిపోతాడు. తన వారి కోసం ఆలోచిస్తూ బతికేస్తాడు. అయినా ఎందుకో నాన్నకి ఈ సమాజంలో అంత గుర్తింపు లేదనిపిస్తుంది. అమ్మ తొమ్మిది నెలలు మోసి జన్మనిస్తే.. నాన్న తన జీవితమంతా పిల్లలను మోస్తాడు. నిస్వార్థ ప్రేమతో గుండెల మీద ఆడుకుంటూ జీవితానికి మార్గం చూపే మార్గదర్శి తండ్రి. చాలామందికి నాన్న అయిన తరువాతనే నాన్న విలువ ఏంటో తెలుస్తుంది. మా నాన్న ఇన్ని బాధలు, బాధ్యతల్ని ఎట్లో మోశాడు? పిల్లలు చేసే అల్లరి, వాళ్లకు కొంచెం సుస్తీ చేసినా గుండెలో అలజడి! ఇవన్నీ ఎట్లా భరించాడు? అని నాన్న అయినతరువాతనే ప్రశ్నించుకుంటారు. అప్పుడే అర్థమవుతుంది. .. నాన్న వేసిన బాటలో నా అడుగులు పడుతున్నాయని ... ఆ టైంలో నాన్న వైపు చూస్తే.. నా పిల్లల కోసం ఆ గ్రేట్ మ్యాన్ ఇప్పుడు తాతగా మారాడు. చిన్నపిల్లాడిలా వాళ్లని ఆడిస్తున్నాడు. కథలు చెప్తూ బుద్ధులు నేర్పుతున్నాడు. తన బిడ్డకు కష్టం రావొద్దని.. మళ్లీ నా కష్టాన్ని పంచుకుంటున్నాడని అనిపిస్తుంది. ఇదే నాన్న గొప్పతనం..

జీవివితంలో ఎవరికైనా నాన్నే రియల్ హీరో! ఈ ముచ్చట ప్రపంచానికి తెలియదు కాని ... ప్రతి ఒక్కరి మనసుకు తెలుసు. ఎవరి నాన్న వాళ్లకు గ్రేట్! చిన్నప్పుడు స్కూల్లో... మా నాన్న సూపర్ హీరో ...అంటే ...మా నాన్న సూపర్ హీరో.... పోటీపడి




కథలు చెప్పుకున్నారు కదా..మీరు .. మీ స్నేహితులు. మా నాన్నకు మస్తు బలం ఉంటదిరా భయ్.. నేను పెద్ద అయిన తరువాత మా నాన్నలెక్కనే అవుతానని అంటారు. నాన్న ప్రభావం అలా ఉంటుంది

నాన్న అడిగింది తెచ్చిఇస్తాడు. ఏ ప్రశ్న అడిగినా ఒడిలో కూర్చోబెట్టుకుని చెప్తాడు. పదోతరగతి వరకు నాన్న ..నాన్నలాగ కనిపిస్తాడు. ఆ తర్వాత నాన్నలో ఒక మంచి దోస్తును చూస్తాము . ఏ దారి ఎట్లాంటిదో వివరించి చెప్తాడు. ఆ వయసులో చిన్నచిన్న విషయాలకే చిరాకు పడ్తున్నా.. కూల్ గా నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు ఆయనొక గొప్ప సైకాలజిస్ట్ గా కనిపిస్తాడు.

**నాన్న ప్రేమ అర్థం కాదు**

తీట పని చేసినప్పుడు వీపు వాయించు అని ఏదో మీ మాటకు అమ్మతో అని వెనకేసుకొస్తాడు. అది పెద్ద తప్పులాగ అనిపిస్తే మాత్రం కసురుకుంటాడు. అదే మాట కసిరింపు అమ్మ నోట్లో వస్తే పట్టించుకోరు. ..కానీ, నాన్న నోట్లోనుంచి వస్తే మాత్రం కోపం, దుఖం తెచ్చుకుంటారు. అమ్మ ఎంత తిట్టినా బాధపడరు కానీ, నాన్న ఓ మాట అంటే చాలు నొచ్చుకుంటారు. నాన్న ప్రేమ అర్థం కాదు. తల్లి ప్రేమలా అది స్పష్టంగా బయటకు కనపడదు. ఎవరన్నా తన పిల్లలను పొగుడుతున్నప్పుడు లోలోపల ఆనందపడుతూనే, వాళ్లతో 'చాలు తీ' అని ఇష్టం లేనట్టు నటిస్తాడు! దిష్టి తగులుతుందేమోనని తన పిల్లలను ఎక్కువగా పొగడనియ్యడు!

**ఏం కోరుకుంటాడు?**

తన పిల్లల్ని గొప్ప స్థానంలో చూడాలనుకుంటాడు నాన్న. దానికోసం నేనేం అయిపోయిన పర్వాలేదు.. అని తన జీవితాన్ని త్యాగం చేస్తాడు. లాస్ట్?కు సాధించినా... సాధించకున్నా ఆయన కోరుకునేది ఒక్కటే..నాన్న... అనే పిలుపు. ఇది తల్లికి కూడా వర్తిస్తుంది. ఆ పిలుపు కోసమే వాళ్లు అన్నీ త్యాగం చేస్తారు. కాబట్టి ఎక్కడున్నా.. ఏం చేస్తున్నా అప్పుడప్పుడు వాళ్ల కళ్లకు కనిపించి పోవాలె. రోజూ కనీసం ఫోన్లోనైనా వినిపిస్తుండాలి

**ఫాదర్స్ డే వెనుక...**

సొనరాది అమెరికాలోని వాషింగ్టన్ పక్కన చిన్న గ్రామం. ఆమెకు ఆరు నెలల వయసున్నప్పుడే తల్లి చనిపోయింది. తండ్రి స్మార్ట్ విలియమ్ వ్యవసాయం చేస్తూ తల్లి లేని లోటు తెలియకుండ ఆమెను పెంచాడు. పాలు పట్టడం, స్నానం చేయించడం, జోలపాడి నిద్రపుచ్చడం.. అన్నీ చేశాడు. ఆ టైంలో ఇంకో పెండ్లి చేసుకునే అవకాశం ఉన్నా.. తన సుఖం కన్నా తండ్రి పాత్రకు న్యాయం చెయ్యాలనున్నాడు. తల్లి అనే ఊహ కూడా రానీయకుండ పెంచాడు. పెద్ద అయిన తరువాత వాళ్ల నాన్న ఎంత గొప్ప వ్యక్తి గుర్తించింది.

సొనరా ..మా నాన్న గ్రేట్ ఫాదర్ .. అని ఆయన పుట్టిన రోజును ..ఫాదర్స్ డేగా .

.జరపాలనుకుంది. వాళ్ల నాన్న జూన్?లో పుట్టాడని తెలుసుగానీ, ఎప్పుడు పుట్టిండో తెల్వదంట అందుకే జూన్? లో ఏదో ఒక రోజు జరపాలని జూన్ మూడో ఆదివారం గ్రామస్తులందరిని పిలిచి ..ఫాదర్స్ డే... నిర్వహించింది. తర్వాత తల్లుల కోసం ఒక రోజు కేటాయించినప్పుడు.. తండ్రుల కోసం ఎందుకు కేటాయించరు?' అని పోరాటం మొదలుపెట్టింది సొనరా దాంతో 1910 జూన్ 19న ప్రపంచంలోనే తొలిసారిగా అమెరికాలో ఫాదర్స్ డే వేడుకలు జరిపారు. అదే కాలక్రమంలో ప్రపంచమంతా పాకింది.

# హైదరాబాద్ లో పెద్ద సమోసా ఫ్యాక్టరీ క్లోజ్.. కారణం తెలిస్తే యాక్ తూ అంటారు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలో కల్తీ ఫుడ్, నాణ్యతలేని ఫుడ్ వల్ల ప్రజల ప్రాణాల మీదకు వస్తుంది. ఇష్టారీతిన హొటల్స్, రెస్టారెంట్లు,స్వీట్ షాపులు, తినే తిండిలో కల్తీ కలకలం సృష్టిస్తోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. గత కొన్ని రోజులు హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీ అధికారులు వరుస తనిఖీలు చేస్తున్నారు. నిన్నటి వరకు రెస్టారెంట్లు,హొటళ్లలో తనిఖీలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇపుడు స్వీట్ షాపులు, చిన్న చిన్న హొటల్స్, సమోసాలు,స్నాక్స్ సెంటర్లపై తనిఖీలు చేస్తున్నారు.జూన్ 14న ఫుడ్ జీహెచ్ఎంసీ గోల్కొండలోని ఓ సమోసా సెంటర్ ను సీజ్ చేసింది. గోల్కొండ ఫోర్ట్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సమోసా తయారీ సెంటర్ ను సీజ్ చేశారు . బడా బజార్ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సమోసాల తయారీ చేస్తున్నారు నిర్వాహకులు. దీంతో స్థానికులు జీహెచ్ఎంసీ కి ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు.. ఎలాంటి లైసెన్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో సమోసాల తయారీ చేస్తున్నట్లు గుర్తించారు. సమోసా తయారీకి కల్తీ ఫుడ్ ఇంగ్రీడియంట్స్ వాడుతున్నట్లు గుర్తించారు.

ఈ మధ్య హైదరాబాద్ నగరంలో బయట ఏం తినాలన్నా ఆలోచించాల్సి వస్తోంది. ఎందులో ఏం కలుపుతున్నారో.. ఎలాంటి కెమికల్స్ వాడుతున్నారో తెలుసుకుంటే వాటిని తినలేం, వాటిని చూస్తేనే వాంతొచ్చేలా ఉంటాయి.

# కక్కుర్తి పడి ఫ్రీ వైఫై వాడేస్తున్నారా..? అయితే మీరు తప్పక ఈ విషయం తెలుకోవాల్సిందే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** రోడ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ఇలా పబ్లిక్ ప్లేసుల్లో చాలా చోట్ల ఫ్రీగా వైఫై దొరుకుతుంది.

ఉచితంగా వస్తుంది కదా అని చాలా మంది ఫ్రీ వైఫై కనెక్ట్ చేసుకుని తెగా వాడేస్తుంటారు. ఉచితమని కక్కుర్తి పడి ఫ్రీ వైఫై వాడితే.. చాలా ప్రమాదమని హెచ్చరించారు తెలంగాణ పోలీసులు. ఫ్రీ వైఫై వాడితే ఎలాంటి అనర్ధాలు ఎదురవుతాయో అవగాహన కల్పించారు.తెలంగాణ పోలీసులు పలు అంశాలపై సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తుంటారు. సైబర్ క్రైమ్స్, డిజిటల్ ఫ్రాడ్స్ ఇలా చాలా రకాల నేరాలపై ప్రజలను అలర్ట్ చేస్తుంటారు. తాజాగా ఫ్రీ వైఫై వాడితే ఎంత ప్రమాదమో అవగాహన కల్పించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఓ వీడియో షేర్ చేశారు. "ఫ్రీ వైఫై అనే పదం వినడానికి చాలా తియ్యగా ఉంటుంది. కానీ అసలు ఫ్రీ వైఫై ఎవరు సెటప్ చేస్తారు..? హ్యాకర్స్ మీ వ్యక్తిగత, ఆర్థిక డేటాను దొంగలించేందుకు బహిరంగ ప్రదేశాల్లో ఫ్రీ వైఫై హాట్?స్పాట్స్ ఏర్పాటు చేస్తారు. ఫ్రీ వైఫై ఉపయోగిస్తే మీ లాగిన్ ఇన్ఫర్మేషన్, బ్యాంక్ యాప్స్ వివరాలు, వ్యక్తిగత ఫొటోలు హ్యాకర్స్ చేతికి వెళ్తాయి. బ్యాంకింగ్, షాపింగ్?కి సంబంధి లావాదేవీలు జరిపేటప్పుడు ఫ్రీ వైఫైను ఉపయోగించకండి. ఉచితంగా లభించే వైఫై ఉపయోగించి హ్యాకర్స్ ట్రాప్?లో పడకండి" అని వీడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు తెలంగాణ పోలీసులు.

# కేసీఆర్‌కు రెండో రోజూ ఏఐజీలో వైద్య పరీక్షలు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శనివారం వైద్య పరీక్షల నిమిత్తం గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ ఆరోగ్య తనిఖీలలో భాగంగా ఆయన వరుసగా రెండో రోజు ఆసుపత్రికి వెళ్లడం గమనార్హం.కేసీఆర్ నిన్న మధ్యాహ్నం కూడా ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఏఐజీ ఆసుపత్రికి వెళ్ళిన విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:30 గంటలకు ఆసుపత్రికి వచ్చిన కేసీఆర్, దాదాపు గంటసేపు అక్కడే ఉన్నారు.ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్, ప్రఖ్యాత గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. కేసీఆర్‌కు ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు లేవని వైద్యులు తెలిపారు. అయితే, ఆయన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారని సమాచారం.

# సెక్రటేరియట్‌లో కొత్త మంత్రులకు ఛాంబర్లు.. ఏ ఫ్లోర్ లో ఎవరంటే.?



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో కొత్త మంత్రులకు సెక్రటేరియట్ లో చాంబర్స్ కేటాయించింది జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్టెమెంట్. కార్మిక, మైనింగ్, జియోలజీ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి సెక్రటేరియట్ సెకండ్ ఫ్లోర్ లోని 20,21,2 2 నంబర్ రూములను కేటాయించింది.అలాగే అడ్లూరి లక్ష్మణ్ కు ఫస్ట్ ఫ్లోర్ లోని 13,14,15 నంబర్ గల రూములను కేటాయించారు.

ఇక మంత్రి వాకిటి శ్రీహరికి సెకండ్ ఫ్లోర్ లోని 26,27,28 నంబర్ గల రూములను కేటాయించింది ప్రభుత్వం.

జూన్ 8న మంత్రులుగా ప్రమాణం స్వీకారం చేసిన ముగ్గురికి జూన్ 11 రాత్రి ప్రభుత్వం శాఖలు కేటాయించింది. ఒక్కో మంత్రికి రెండు శాఖల చొప్పున బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న

శాఖలను కొత్త మంత్రులకు కేటాయించారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి కార్మిక,మైనింగ్, ఉపాధిశాఖలు.. వాకిటి శ్రీహరికి పశుసంవర్ధక శాఖ, స్పోర్ట్స్, కల్చర్ .. అడ్లూరి లక్ష్మణ్?కుఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ కేటాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 19 నెలల తర్వాత కేబినెట్‌ను విస్తరించారు. సీఎం రేవంత్?తో పాటు 15 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. కెబినెట్‌లో సీఎం సహా 18 మందికి అవకాశం ఉంది. మరో 3 బెర్తులు ఖాళీగా ఉన్నాయి.

# బెంగళూరులో ఇంటి ఓనర్ అరాచకం.. పెయింటింగ్-డ్యామేజీ ఖర్చులంటూ రూ.82వేలు వసూలు!




హైదరాబాద్ పెన్ పవర్: బెంగళూరు ఐటీ రంగానికి పెట్టింది పేరు. ఒకప్పుడు ఈ నగరానికి చాలా మంది తమ ఉపాధి కోసం, మొదటి సారి ఉద్యోగం సంపాదించటం కోసం వెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ నగరానికి రద్దీ తగ్గుతున్నప్పటికీ.. అక్కడ ఇంటి యజమానులు చేసే పనులు మాత్రం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. ఒకపక్క భారీ అద్దెలు, అడ్వాన్సులు డిమాండ్ చేసే ఓనర్లు చివరికి ఖాళీ చేసేటప్పుడు అద్దెకు ఉన్న వారికి చుక్కలు చూపిస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బెంగళూరులో ఐఐటీ గ్రాడ్యుయేట్ అయిన శ్రవణ్ టిక్కూ తన ఇంటి యజమానితో ఎదురైన అనుభవాన్ని పంచుకున్నాడు. సర్జాపూర్ రోడ్డులో ఒక 2%దీఎఖ%లో దాదాపు రెండేళ్ళు అద్దెకు ఉన్నట్లు చెప్పాడు. అయితే అందులో చేరే ముందు తన యజమానికి తాను లక్షన్నర రూపాయలు అడ్వాన్స్ రూపంలో చెల్లించినట్లు వెల్లడించాడు. కానీ చివరికి ఇల్లు ఖాళీ చేసినప్పుడు ఇంటి రిపేర్లకు రూ.25వేలు, పెయింటింగ్ ఖర్చులకు రూ.55వేలు యజమాని తీసుకున్నట్లు వెల్లడించాడు. అయితే తాను అద్దెకు ఉన్న రోజుల్లో కనీసం ఒక్కసారి కూడా తనతో యజమాని మాట్లాడలేదని విద్యార్థి చెప్పాడు. బిల్డింగ్ మేనేజరు ద్వారానే తనతో సంప్రదింపులు జరిపినట్లు చెప్పాడు.

తాను డిపాజిట్ చేసిన మొత్తంలో చివరికి రూ.68వేలు మాత్రమే తిరిగి వెనక్కి చెల్లించినట్లు విద్యార్థి వెల్లడించాడు. ఇక లిఫ్టు వాడుకున్నందుకు కూడా రూ.2వేలు వసూలు చేసినట్లు చెప్పాడు. వివరాలు అడిగితే చేతితో రాసిన ఒక చీటీ తనకు ఇచ్చారని, అందులో వేరువేరు ఛార్జీలను ఇంటి యజమాని రాసినట్లు చెప్పాడు. బెంగళూరులో ఇంటి యజమానులతో చాలా జాగ్రత్తగా ఉండాలని, అసలే భారీగా ఉన్న అద్దెలకు తోడు ఇలా ఇష్టమొచ్చినట్లు చివరికి డిపాజిట్ ఎగ్గొట్టేవారు చాలా మంది ఉంటారని సోషల్ మీడియాలో కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం బెంగళూరుకు వచ్చే ప్రజలకు అక్కడి ఇంటి యజమానులు పెద్ద ముప్పుగా మారుతున్నారని రీథింక్ సిస్టమ్స్ వ్యవస్థాపకులు శ్రవణ్ టిక్కూ పేర్కొన్నారు. ఒకసారి తాను ఉంటున్న ఇంట్లో కిటికీ అద్దం పగిలినప్పుడు దానిని రిపేర్ చేయించి అద్దెలో ఆ మొత్తాన్ని తగ్గించి బిల్ వాట్సాప్ చేశానని, దానికి యజమాని ససేమిరా అంటూ తనతోనే బిల్లు కట్టించినప్పుడే ఖాళీ చేసే రోజు అంత సులువుగా ఆమె విడిచిపెట్టదని అర్థం చేసుకున్నట్లు చెప్పాడు. చాలా మంది బెంగళూరు యజమానులు ఇలా అద్దెకు వచ్చేవారిని ఇబ్బంది పెట్టడంతో పాటు వారి అడ్వాన్స్ డబ్బులను అనవసరమైన ఖర్చులు చూపి మింగేస్తున్నారని సోషల్ మీడియాలో చాలా మంది బాధితులు చెబుతున్నారు.

# గద్దర్ ఫౌండేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం చేయూత.. రూ.3 కోట్లు మంజూరు



హైదరాబాద్ పెన్ పవర్:ప్రముఖ విప్లవ కవి, వాగ్గేయకారుడు, దివంగత గద్దర్ సేవలను గౌరవిస్తూ ఆయన ఆశయాలను సజీవంగా ఉంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గద్దర్ ఫౌండేషన్‌కు మూడు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధుల కేటాయింపునకు ఇటీవలే ఆమోదముద్ర వేశారు. గద్దర్ భావజాలాన్ని పరిరక్షించడం, ఆయన ఆలోచనలు, సాంస్కృతిక ప్రభావంపై పరిశోధనలను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ నిధులను గద్దర్ ఫౌండేషన్ చేపట్టే వివిధ కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ముఖ్యంగా గద్దర్ స్ఫూర్తిని కొనసాగించే పరిశోధన కార్యక్రమాలు, ఆయన స్మారకార్థం చేపట్టే ప్రాజెక్టులు, గద్దర్ జయంతి వంటి కార్యక్రమాల నిర్వహణకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడనుంది. గద్దర్ రచించిన పాటలు, ఆయన చేసిన పోరాటాలు, అందించిన సృజనాత్మక సందేశాన్ని భవిష్యత్ తరాలకు చేరవేయాలనేది ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, అణగారిన వర్గాల హక్కుల కోసం గద్దర్ చేసిన నిరంతర పోరాటానికి గుర్తింపుగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

గద్దర్ తన జీవితాంతం కుల వివక్ష, సామాజిక అన్యాయాలపై తన గళాన్ని బలంగా వినిపించారు. తెలంగాణ ఉద్యమ సాంస్కృతిక విభాగంలో ఆయన పోషించిన పాత్ర అత్యంత కీలకమైనది. తన పాటలు, ప్రసంగాల ద్వారా సామాజిక సమస్యలపై ప్రజల్లో చైతన్యం రగిలించడంలో గద్దర్ ముందున్నారు. 2023 ఆగస్టులో ఆయన మరణం ఒక శకానికి ముగింపు పలికినప్పటికీ, గద్దర్ ఫౌండేషన్ ద్వారా ఆయన ప్రభావం కొనసాగుతోంది. ఇప్పటికే హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గద్దర్ స్మారక చిహ్నం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. గద్దర్ ఫౌండేషన్‌కు ఈ మూడు కోట్ల రూపాయల కేటాయింపు ద్వారా ఆయన ప్రబోధించిన సమానత్వం, న్యాయం, సాంస్కృతిక వైభవం వంటి విలువలను పరిరక్షించి, రాబోయే తరాలకు అందించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయంగా కనిపిస్తోంది.

## 13వ రోజుకు చేరుకున్న పాండవ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా


**హైదరాబాద్ పెన్ పవర్:**బేతంచర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో గల పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ధర్నా శనివారం 13వ రోజుకు చేరుకుంది ధర్నాకు మద్దతుగా గోరుమానుకొండ టిడిపి నాయకులు మద్దతు పలికారు టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, గ్రామ అభివృద్ధి పై అవగాహన లేకపోగా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న ధర్నాపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని అన్నారు గ్రామ ప్రజలు అందరూ కలిసి సర్పంచ్ గా ఎన్నుకున్నారని ముందుగా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని అన్నారు.వైసిపి కార్యాలయంలో నాయకులు కార్మికులు చేస్తున్న ధర్నాను అవమానపరిచే విధంగా మాట్లాడడం సరైనది కాదని ఫ్యాక్టరీ పర్మినెంట్ ఉద్యోగి మోజెస్, అన్నారు.మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనకు ఫ్యాక్టరీ కి సంబంధం లేదు అనడం హాస్యాస్పదమని అన్నారు. మాజీ మంత్రి బుగ్గన చొరవతో సుమారు 400 కుటుంబాలు పైగా ఉద్యోగాలు కోల్పోయి ఆకలి అలమటించారని అన్నారు పర్మినెంట్ ఉద్యోగులు 33 మంది ఉద్యోగులను తీసివేయడానికి ఎన్నో భయభ్రాంతులకు గురి చేశారని పోలీసులతో ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు మాజీ మంత్రి బుగ్గన ఫ్యాక్టరీ యాజమాన్యం కుమ్మక్కై ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్న కార్మికులను తొలగించి వైసిపి కండువా వేసుకున్న వారిని ఉద్యోగంలోకి తీసుకున్నారని అన్నారు రిటైర్డ్ డిఎస్పి నరసింహారెడ్డి స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా వైసిపి కండువా వేసుకున్న వారికి ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు మాజీ మంత్రికి ఫ్యాక్టరీ తో సంబంధం లేకపోతే గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు ఫ్యాక్టరీకి వచ్చారు వైసిపి నాయకులు గమనించాలని అన్నారు.వైసీపీ కార్యాలయంలో కూర్చొని కార్మికులపై అబాండాలు వేయడం కంటే గ్రామంలోని వైసిపి నాయకులు బేతంచెర్ల వైసిపి నాయకులు ధర్నా వద్దకు వచ్చి చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

## ఎపి జల దోపిడికి బిజెపి పూర్తి మద్దతు: హరీష్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ జల దోపిడికి పాల్పడుతోందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ఎపి నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ బిజెపి నేతలు ఏం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్ లో బనకచర్ల ప్రాజెక్టుపై హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బిజెపి పార్టీలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎపి జల దోపిడికి బిజెపికి పూర్తి మద్దతు తెలుపుతుందన్నారు. న్యాయబద్ధంగా రెండు రాష్ట్రాలకు కేంద్రం నీళ్లు పంచాలని.. కానీ ఎపికి బిజెపి మద్దతు తెలుపుతుందని చెప్పారు.పునర్విభజన చట్టంలోని నిబంధనలను ఏపీ ప్రభుత్వం తుంగలో తొక్కుతుంటే నియంత్రించాల్సిన కేంద్రం.. నిధులిస్తూ తెలంగాణకు ద్రోహం చేస్తుందని హరీష్ రావు మండిపడ్డారు. రాష్ట్రం నుండి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డికి, బండి సంజయ్.. ప్రధాన మంత్రితో మాట్లాడి ఎపి నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని అన్నారు. ఎపి జల దోపిడిపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అఖిల పక్ష సమావేశం నిర్వహించాలన్నారు. అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి బనకచర్లను వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని.. లేకపోతే, బిఆర్ఎస్ ప్రజా పోరాటానికి, న్యాయ పోరాటానికి శ్రీకారం చుడుతుందని హరీష్ రావు అన్నారు.

## బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ జాగృతిలో విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున చేరారు. వారికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కండువా కప్పి తెలంగాణ జాగృతిలోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థి లోకం కదిలిరావాలి. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కొట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలి. సామాజిక తెలంగాణను సాధించడానికి విద్యార్థులు నడుం బిగించాలని అన్నారు.

బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్ లో ఉండగానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదు. బీసీలకు 42 రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోము. 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి. కర్నాటకలో కులగణన ఎలా చేయాలో అక్కడి సీఎం సిద్దరామయ్యకు నేర్పించానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారు. సీఎం ఈ ప్రకటన చేసిన గంట సేపటికే కాంగ్రెస్ అధికారికంగా ఒక ఫోటో విడుదల చేసింది . ఆ ఫోటోలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్దరామయ్య, డీకే శివకుమార్ ఉన్నారు కానీ రేవంత్ రెడ్డి మాత్రం లేరని అన్నారు.

దీన్ని బట్టే రేవంత్ రెడ్డి ఎన్ని అబద్దాలు ఆడుతున్నారో అర్థమవుతోంది. రాహుల్ గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్ రెడ్డి విలవిలలాడుతున్నారు. దర్శనాల సంగతి పక్కనబెట్టి ప్రజా సమస్యలపై సీఎం దృష్టిపెట్టాలని అన్నారు.

ఆర్ఎస్ఎస్ స్కూల్, టీడీపీ కాలేజీలో చదువుకున్నానని.. జాబ్ కాంగ్రెస్ లో చేస్తున్నానని సీఎం అన్నారు. చేస్తున్న జాబ్ లో కూడా రేవంత్ రెడ్డికి పాస్ మార్కులు రావడం లేదు. ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ చేశారు. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు చేసుకోలేని సీఎం రేవంత్ రెడ్డి. ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఉమ్మడి రాష్ట్రంలో చివరి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఇంత బలహీనంగా లేకుండే నని అన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్ రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారు. విద్యార్థల సమస్యలు, విద్యారంగ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉంది. దాదాపు 8 వేల కోట్ల మేర ఫీజు రియింబర్స్ మెంటు బకాయిలు ఉన్నాయని అన్నారు.తక్షణమే ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. విద్య భరోసా కార్డులు పంపిణీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని విస్మరిస్తోంది. తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని అన్నారు.

# గంటలో దర్శనానికి ప్లాన్

**హైదరాబాద్ పెన్ పవర్:**

తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. ప్రతి ఏడాది స్వామి వారిని దర్శించుకునే వారు ఉంటారు. రోజుకు గరిష్టంగా లక్షలాదిమంది.. కనిష్టంగా వేలాది మంది భక్తులు తిరుమల వస్తుంటారు. వారికి దర్శనాలు కల్పించడంతోపాటు నియంత్రించడం టిటిడి కి కష్ట సాధ్యం అవుతుంది. పటిష్టమైన చర్యలు చేపడుతున్న ఎక్కడో చోట లోపాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కొన్ని సందర్భాల్లో క్యూ లైన్లోకి మించి బయటకు భక్తులు వస్తుంటారు. కొన్ని సందర్భాల్లో అయితే గంటలపాటు కాంప్లెక్స్ లలో భక్తులు వేచి ఉండాల్సి ఉంటుంది. ఇటువంటి తరుణంలో వినూత్న ఆలోచన చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. భక్తులు క్యూ లైన్ లలో ఉండగానే స్వామి వారి దర్శన భాగ్యం కల్పించేందుకు నిర్ణయించింది.సాధారణంగా తిరుమల వెళ్లే భక్తులకు స్వామివారి దర్శనానికి కొన్నిసార్లు 12 గంటల సమయం పడుతుంది. ఆ సమయంలో భక్తుల బాధలు వర్ణనాతీతం. టీటీడీ( పరంగా మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు అందిస్తోంది. కానీ క్యూలైన్లలో భక్తులు ఉన్నప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. అటువంటి సమయంలో స్వామివారి దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేసింది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇటీవల చైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కీలక నిర్ణయం తీసుకున్నారు. అందుకు సంబంధించి టీటీడీ ఈవో శ్యామలరావు కార్యాచరణను వేగవంతం చేశారు. ముఖ్యంగా భక్తులు వేచి ఉండే కంపార్ట్మెంట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మధ్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారుఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కెమెరాలు ద్వారా తిరుమల వచ్చే భక్తుల రద్దీ ని అంచనా వేయనున్నారు టీటీడీ అధికారులు. తద్వారా భక్తులకు దర్శన సమయాన్ని నిర్దిష్టంగా ఇవ్వనున్నారు. ప్రస్తుతం గంటకు ఎంతమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారనే సమాచారం టిటిడి వద్ద లేదు. ఆ వివరాలు అందుబాటులోకి వస్తే దళారులు, కొందరు ఉద్యోగుల సహకారంతో ఇష్టారాజ్యంగా క్యూ లైన్లోకి వచ్చే సంస్కృతికి బ్రేక్ పడుతుంది. జియో సంస్థ ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫేషియల్ రికగ్నిషన్ ను ఉపయోగించి భక్తుల మొక్క చిత్రాలు నమోదు చేస్తుంది. తద్వారా గంటల వ్యవధిలోనే తిరుమల శ్రీవారి దర్శనం పూర్తి చేసుకునే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది తిరుమల తిరుపతి దేవస్థానం. ఇదే విషయాన్ని తాజాగా వెల్లడించారు టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు.

# స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలి




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకం. అవి అసెంబ్లీ అయినా కావొచ్చు, పార్లమెంట్ అయినా కావొచ్చు, స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికలైనా కావొచ్చు. ప్రతి స్థాయిలో ఈ ఎన్నికలు సమయానికి అనుగుణంగా జరగాలని భువనగిరి మాజీ ఎంపి డా బూర నర్సయ్య గౌడ్ అన్నారు.

కాని..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 18 నెలలు గడిచినా, ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత లేదు. రాష్ట్రంలో 12,769 మంది సర్పంచుల పదవీకాలం 2024 జనవరి 31న ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 5,717 మంది ఎంపీటీసీల పదవీకాలం 2024 మే నెలలో ముగిసింది. ఇప్పటికీ ఈ స్థానాల్లో ఎన్నికలు జరగలేదు.

538 మంది జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ చైర్ పర్సన్ల పదవీకాలం కూడా పూర్తయ్యి సంవత్సరం దాటిపోయింది. రాష్ట్రంలోని 130 మున్సిపాలిటీలలో 128 మున్సిపాలిటీల పదవీకాలం పూర్తై ఆరు నెలలు గడిచింది. అయినా ఇప్పటికీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈరోజు స్థానిక సంస్థల ఎన్నికలు అనేవి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-%ూ, 243-ఖ, 243గ్గాూ% పరిధిలో ఉన్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత మరియు స్టేట్ ఎలక్షన్ కమిషన్ అధీనంలో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణతో సంబంధం లేదు. ఇది పూర్తిగా రాష్ట్ర పరిధిలో ఉన్న అంశం. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు లేట్ కావడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు.

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి లోకల్ బాడీలకు అభివృద్ధి నిధులు ప్రధానంగా కేంద్ర ఫైనాన్స్ కమిషన్ ద్వారా వస్తాయి. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావలసిన రూ. 1514 కోట్లు నిధులు ఎన్నికలు జరగకపోవడం వల్ల నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రజలు ఈ నష్టాన్ని భరించాల్సి వస్తోంది. అంతేకాక, గతంలో 14వ ఆర్థిక సంఘం కింద రావలసిన రూ. 800 కోట్ల బకాయిలు కూడా పెండింగ్లో ఉన్నాయి. ఇవి కూడా ఎన్నికల నిర్వహణ లేకపోవడం వల్ల విడుదల కాలేదు. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోందని అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. ఎన్నికల్లో రిజర్వేషన్ నిష్పత్తి నిర్ణయించే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆ ప్రక్రియను అమలు చేస్తుంది. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు ఎలా ఉండాలన్న దానిపై తుది నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కానీ ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వడంలో విఫలమవుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ గాంధీ గొప్పగా మాటలు చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసారు.

కానీ ఆ హామీలు ఎటూ తీరకపోవడం, ఎన్నికలు జరగకపోవడం వల్ల అభివృద్ధి నిధులు నిలిచిపోవడం.. ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను చూపిస్తున్నాయి. అందువల్ల తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి, రాష్ట్రం నష్టపోకుండా చూడాలని అన్నారు.

ఆర్టికల్ 243 (%ఖ), 243 గ్గ(), 243 (ూ%) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హక్కు, బాధ్యత. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి పాత్ర లేదు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వంటి స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తే, రాష్ట్రంలో ఎన్నికలు జరగకపోవడం వల్ల ఆ నిధులు పూర్తిగా వినియోగం కావడం లేదు.

రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎంత ఉండాలో నిర్ణయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానిదే. అయితే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలన్నది ఇంకా అమలు రూపం దాల్చలేదు.

బీసీలకు రిజర్వేషన్ పెంచాలంటే 'ట్రిపుల్ టెస్ట్' ప్రకారం ం (1) కులగణన, (2) బీసీ కమిషన్, (3) డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టంగా పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలంప్రకటనలు చేసి, పబ్లిక్కు వివరాలు మాత్రం వెల్లడించలేదని అన్నారు.

ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై నెపం నెట్టాలని చూడటం తప్పుదారి పట్టించే చర్య అని అన్నారు.

ఇప్పటికైనా రాష్ట్రంలో బీసీ కులాల గణాంకాలను ప్రచురించాలని, రిజర్వేషన్లను అమలు చేసి ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేస్తోంది. ఈ పరిస్థితుల్లో, ప్రతి రోజూ ఒక మంత్రి "ఇప్పుడు జరుగుతాయి", "తొందర్లో ఉంటాయి", "సంక్రాంతికి జరుగుతాయి" వంటి ప్రకటనలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.

# కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉంది

**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ లోని పలు హామీలను ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తోందని, పెద్ద ఎత్తున సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని, మున్సిపల్ శాఖ ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలను కనీస సౌకర్యాల కల్పనకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రామాపురం డంపింగ్ యార్డ్ ను మున్సిపల్ శాఖ మంత్రి గ్రీన్ అండ్ బ్యూటిఫికెషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మున్సిపల్ అధికారులు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన రాష్ట్రంలో గత ప్రభుత్వం వదిలి వెళ్ళిన 85 లక్షల టన్నుల లెగసినీ, గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అవకతవకలతో 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులను ఈ ప్రభుత్వానికి వదిలేసి వెళ్లారు అని అన్నారు. మన ముఖ్యమంత్రి విజన్ ఉన్న నాయకుడు అని, గతంలోనే చంద్రబాబు నాయుడు గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నప్పుడు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని అమలు చేశారని, అలాగే 2014-19 సంవత్సరంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందనీ, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను అనేక కార్యక్రమాలు చేశామని, అనేక పరికరాలు కూడా మున్సిపాలిటీలకు ఇవ్వడం జరిగిందని, గత ప్రభుత్వం వాటిని పక్కన పడేసిందనీ, ఇప్పటి మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు అక్టోబర్ రెండవ తేదీ మచిలీపట్నంలో ప్రకటించారనీ 365 రోజుల్లో ఈ రాష్ట్రంలో ఉన్న 85 లక్షలు టన్నుల చెత్తను క్లియర్ చేస్తామని తెలిపారని అన్నారు. అందులో భాగంగా పలు సార్లు సమావేశాలు, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టామని, అలాగే చెత్తను క్లియర్ చేయడానికి పలు కంపెనీలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు 45 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడం జరిగిందని ఇంకనూ రాబోయే మూడు నెలలలో 35 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మన తిరుపతి జిల్లా తీసుకుంటే జిగ్మా అనే కంపెనీ ముందుకు వచ్చిందని వాళ్లు రోజుకు 900 టన్నుల లెగసి క్లియర్ చేస్తున్నారు. అయితే రోజుకు వారు 2700 టన్నులు క్లియర్ చేయాల్సి ఉందనీ, ఏవైతే మున్సిపాలిటీలలో రోజువారీగా క్లియర్ చేయవలసిన లెగసీకన్నా తక్కువ చేస్తున్నారో సమీక్షించినప్పుడు వాటిని ప్రత్యక్షంగా పరిశీలించాలని జిల్లాల పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా కు రావడం జరిగింది తెలిపారు. పవర్ కనెక్షన్ లేదని కంపెనీ వారి తెలుపుతున్నారని, జనరేటర్ మీద చేపడుతున్నారని సమస్యను క్లియర్ చేయాలని తెలుపగా జెసి గారిని ఫాలో అప్ చేయాలని ఆదేశించామని, నాలుగైదు రోజుల్లో పవర్ కనెక్షన్ ఇస్తామని ఎస్ఈ %ఖజూంజూఎశ్రీ% తెలిపారని అన్నారు. ఈ లెగసి క్లియరెన్స్ కార్యక్రమంలో కృషి చేస్తున్న అధికారులందరినీ మరియు కంపెనీ ప్రతినిధులను ప్రత్యేకంగా అందరిని అభినందిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా ప్రజలు కోరుకునేది ఏమంటే త్రాగడానికి స్వచ్ఛమైన నీరు, రోజువారిగా వచ్చే చెత్తను సాలిడ్ వేస్ట్ ను తొలగించడం, టాయిలెట్స్ నుంచి వచ్చే సీవరేజ్ వాటర్ ను క్లియర్ చేయడం, వర్షాలు వస్తే నీటిని బయటకు పోయేలా చేయడం, చక్కటి రోడ్లు, డ్రెయిన్లు కావాలని ప్రతి పౌరుడు కోరుకుంటారని అన్నారు. పార్కులు, సెంటర్ డివైడర్లు, మంచి స్కూళ్లు, హాస్టళ్లు కావాలని ప్రజలు కోరుకుంటారు అన్నారు. సూపర్ సిక్స్ లో చెప్పిన హామీలను ఒకదాని తర్వాత ఒకటి అమలు చేస్తూ ఉన్నామని, లోటు బడ్జెట్ తో ఉన్నా కూడా అనేక హామీలను అమలు చేశామని, ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు పెద్ద ఎత్తున పెంచి లబ్ధిదారులకు అందిస్తున్నామని, నిన్న ఒక్కరోజే పదివేల కోట్ల రూపాయలను తల్లికి వందనం కార్యక్రమం కింద ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అందరినీ చదివించడానికి ఒక్కొకరికి 15 వేల రూపాయల వంతున నిధులు జమ చేయడం జరిగిందని అన్నారు. ఆర్థికంగా రాష్ట్రం ఎంత కష్టంలో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు అందించే కార్యక్రమం అమలు చేస్తున్నామని అన్నారు. ఈ నెలలోనే మాట ఇచ్చిన ప్రకారం రైతులకు 20 వేల రూపాయలను అందించే కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం

రూ. 6000 ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ 14000 రూపాయలు మూడు దఫాలుగా ఇచ్చే నేపథ్యంలో మొదటి దశ డబ్బును ఈ నెలలో ఇస్తున్నాం అని తెలిపారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడం జరుగుతుందని అని తెలిపారు. అన్నా క్యాంటీన్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి పట్టణాలలోని రెండు లక్షల 25 వేల మంది పేదల ఆకలి తీరుస్తున్నమని తెలిపారు. నాణ్యమైన భోజనం అయిదు రూపాయలకే రుచికరంగా అందిస్తున్నామని ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన గొప్ప కార్యక్రమం ఇది అని అన్నారు. రానున్న కాలంలో ఈ రాష్ట్రంలోని 240 అన్నా క్యాంటీన్లే కాకుండా మరిన్ని 70 అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమం అమలుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మనిషికి స్వచ్ఛమైన నీరు అందించాలని, పలు రకాల జబ్బులు కలుషితమైన నీరు నుంచి వస్తాయని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని కొళాయి ద్వారా అందించే అభివృద్ధి స్కీం ఏషియన్ ఇన్వెస్ట్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రోగ్రాం 5350 కోట్ల కార్యక్రమం 2019 సంవత్సరం 70 శాతం కేంద్రం, 30% రాష్ట్రం వాటా ఉంటుందని, గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం

వలన కేంద్ర నిధులు నిలిచిపోయాయని, ప్రస్తుత ముఖ్యమంత్రి ద్వారా మళ్ళీ నిధుల విడుదలకు కేంద్రంతో మాట్లాడారని తెలిపారు. అలాగే స్వచ్ఛాంధ్రపై కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ శాఖ

ద్వారా ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాల ఏర్పాటుకు అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ, డబుల్ ఇంజన్ సర్కార్ పనితీరుతో అన్ని కార్యక్రమాలు అమలు అవుతున్నాయని, తిరుపతి జిల్లాలోని రామాపురం డంపింగ్ యార్డ్ ను పరిశీలించుటకు మునిసిపల్ శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ స్వయంగా పరిశీలించుటకు వచ్చారని మొన్ననే ఢిల్లీలో వేస్ట్ మేనేజ్మెంట్ పై పరిశీలించి అధికారులతో మాట్లాడి మన రాష్ట్రంలో వేస్ట్ మేనేజ్మెంట్ ప్రక్రియ మరింత మెరుగ్గా చేపట్టేందుకు అవకాశాలపై పరిశీలిస్తున్నారని తెలిపారు. రామాపురం డంపింగ్ యార్డ్ నందు వేస్ట్ టు ఎనర్జీ తయారీ చెత్త నుండి సంపద సృష్టి జరుగుతోందని తెలిపారు.

# అహ్మదాబాద్ లో విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం



**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన నేపథ్యంలో ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. AI-171 నంబర్‌ను నిలిపివేయాలని నిర్ణయించింది. విమాన ప్రమాద మృతులకు గౌరవార్ధంగా ఈ నెంబర్ ను నిలిపివేస్తున్నట్లు ఎయిర్ ఇండియా శనివారం ప్రకటించింది. AI-171 స్థానంలో AI-159 నెంబర్ విమానం అహ్మదాబాద్-లండన్ మధ్య సేవలందించనుందని తెలిపింది.కాగా, గురువారం అహ్మదాబాద్‌లో జరిగిన విషాదకరమైన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతుల సంఖ్య 270కి పెరిగిందని వైద్యులు తెలిపారు. లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయానికి వెళ్తున్న విమానం AI 171 గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి బయలుదేరిన నిమిషాలకే మెడికల్ హాస్టల్ భవనాన్ని ఢీకొట్టిన సంగతి తెలిసిందే.

## మామిడి రైతులు, వ్యాపారులతో మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:**
పాకాల(మం) దామలచెరువులో మామిడి రైతులు, వ్యాపారులతో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమావేశమయారు.
మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5లక్షల హెక్టార్లకు పైగా మామిడి సాగు అవుతుంది. 22వేల టన్నులు మార్కెటింగ్ జరిగింది. లక్ష టన్నులకు పైగా జరగాల్సి ఉంది. తోతాపూరి కేజీ రూ.12 రైతులకు చెల్లించాలి. చివరి మామిడి కాయ వరకు రు.4 సబ్సిడీ కల్పిస్తామని అన్నారు.
పరిశ్రమలు రూ.8 తప్పనిసరిగా ఇవ్వాల్సిందే . గుజ్జు పరిశ్రమలు సకరించకపోతే చర్యలు తప్పవు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తిరుమల అన్నా ప్రసాదంలో ఇతర పుణ్యక్షేత్రాల్లో మధ్యాహ్నం ఒక గ్లాస్ మ్యాంగో జ్యూస్ ప్యాకెట్ అందించేందుకు ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతున్నాం. మామిడి సాగుతో పాటు ఇతర లాభసాటి పంటలపై రైతులు దృష్టి సారించాలి. 3 గుజ్జు పరిశ్రమలు రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మిర్చి రూ.20వేలు వచ్చేదని జగన్ మోహన్ రెడ్డి అంటున్నాడు. జగన్ మోహన్ రెడ్డి అవగాహన లేకుండా మా ట్లాడుతున్నాడు. గత 10 సంవత్సరాలలో ఒక్కసారి మాత్రం (2022) లో రూ.20 వేలు వచ్చింది. మిగిలిన 9 సంవత్సరాలు మిర్చికి రూ.14వేలు ధర వచ్చింది. జగన్ నువ్వు ఒక్క సంవత్సరం ముఖ్య మంత్రివా... లేక 5 సంవత్సరాల ముఖ్యమంత్రివా అని అన్నారు.

## ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్-2025 షెడ్యూలు విడుదల

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్‌లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూలును ఏపీ సాంకేతిక విద్యాశాఖ వెల్లడించిందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె వి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు .ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జూన్ 20 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది.కౌన్సిలింగ్ కు సంబంధించిన ప్రాసెసింగ్ ఫీజును ఆన్లైన్ విధానంలో చెల్లించడానికి జూన్ 20 వ తేదీ నుండి జూన్ 27 వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఫీజు OC/BC వారికి రు.700/-, SC/ST వారికి రు.250/- గా నిర్ణయించబడింది.

# హెల్త్ ప్రైమరీ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**హైదరాబాద్ పెన్ పవర్:**
మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను శనివారం మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆకస్మిక తనిఖీ చేసి తలుపులకు తాళాలు వేసి ఉండటంతో ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ సంబంధిత సిబ్బంది డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాల్సిన డాక్టర్లు ఇతర సిబ్బంది అందుబాటులో లేకపోగా కనీసం తలుపులు కూడా తీయకపోవడం దారుణమని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు వెంటనే చరవానిలో కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని సస్పెండ్ చేయాలంటూ ఆయన ఆదేశించారు అంతేకాకుండా హాస్పిటల్ లో పనిచేసే సిబ్బంది రక్త సేకరణ పరికరాలను హాస్పిటల్ బయట ఉంచిన ఆరోగ్య సిబ్బందిపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఎక్కడో ఉన్న హాస్పిటల్ ను ప్రజల సౌకర్యార్థం కోసం



ఇక్కడికి తెచ్చి పెడితే సిబ్బంది లేకుండా డాక్టర్ లేకుండా హాస్పిటల్కు తాళాలు వేయడమేంటని శాసనసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు ఉద్యోగులు తమ విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ అసహనం వ్యక్తం చేశారు ఈ ఇష్యూ పైన కడప జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ఫోన్లో చర్చించి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్కు విన్నవించగా ఎమ్మెల్యేకు కలెక్టర్ బదులిస్తూ సంబంధిత సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకుంటానని కలెక్టర్ చెప్పారు శాసనసభ్యులు వెంటా మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర సుబ్బారెడ్డి పుట్టా ప్రభాకర్ కటారి కృష్ణ దాసరి బాబు ఇతర నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డా పి.సి.రాయులు ఆధ్వర్యంలో ఘనంగా కుమార మంగళం బిర్లా జన్మదిన వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:**పద్మభూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లా 58వ జన్మదిన వేడుకలు స్థానిక గాంధీ రోడ్ లోని కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ (5) ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డా౹౹ పి.సి.రాయులు అధ్యక్షతన అత్యంత ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ జి. భాను ప్రకాష్ రెడ్డి , తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మొదటగా కేక్ కట్చేసి, అనంతరం 1000 మంది స్థానిక పేద ప్రజలకు ఈ సందర్భంగా అన్నదాన వితరణ చేయడం జరిగినది.ఈ సందర్భంగా కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ (రి) చైర్మన్ డా? పి.సి.రాయులు మాట్లాడుతూ పద్మ భూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లాజి 28 సంవత్సరాల వయసులోనే ఆదిత్య బిర్లా గ్రూప్ బాధ్యతల స్వీకరించి నేడు ప్రపంచవ్యాప్తంగా ఆదిత్య బిర్లా గ్రూపును విస్తరింపజేసి అనేక రంగాలలో దాదాపు ప్రత్యక్షం గా 2 లక్షల మంది ఉద్యోగులు వారి సంస్థల్లో పనిచేస్తున్నారని పరోక్షంగా లక్షలాది మంది ఉపాధి పనిచేస్తున్నారని అన్నారు. వారి పూర్వీకులు కూడా దేశ సేవ చేశారని, వారు , వారి కుటుంబ సభ్యులు అందరూ కూడా ఆ దేవదేవుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నామని, తెలిపారు. 2025 సంవత్సరానికి గాను ది గ్లోబల్ లీడర్ షిప్ అవార్డు పొందారని తెలియజేసారు. అలాగే గత 20 సంవత్సరములుగా కస్తూరిబా గాంధీ కేంద్ర




ట్రస్ట్ (రి) ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం చేస్తున్నామని, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల వారికి అలాగే పేద మహిళలకు అన్ని రకాల వర్గాల వారికి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని తెలియజేస్తూ, కోవిడ్ సమయంలో కూడా కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు ద్వారా దేశవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేశామని, తెలంగాణ గవర్నర్ గారి ద్వారా కూడా అవార్డులు కూడా పొందామని తెలియజేస్తూ ఈ ట్రస్టు ద్వారా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా తెలియజేశారు.
ముఖ్య అతిథులుగా విచ్చేసిన టిటిడి బోర్డు మెంబర్ జి.భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డా౹౹ పి.సి.రాయులు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని వారి సేవా కార్యక్రమాలను కొనియాడుతూ, పద్మభూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లా గారు వ్యాపార రంగంలో విస్తరించినప్పటికీ సేవా కార్యక్రమాలు కూడా చేస్తుండడం గొప్ప విషయమని వారి జన్మదిన సందర్భంగా శు భాకాంక్షలు తెలియజేశారు. మరొక ముఖ్య అతిథి తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు మాట్లాడుతూ పద్మభూషణ్ డాక్టర్ కుమార మంగళం బిర్లా ప్రపంచవ్యాప్తంగా ఆదిత్య బిర్లా గ్రూపును విస్తరింపజేసి లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం గొప్ప విషయమని తెలియజేస్తూ వారికి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేస్తూ, డా? పి.సి.రాయులు నిరంతర సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి, స్థానిక బిజెపి నాయకులు, ట్రస్టు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు